సరస్వతీదేవీగా రుద్రేశ్వరి దర్శనం


పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని దంపతులు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : వేయిస్తంభాల ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల ఏడో రోజు బుధవారం ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వరిని సరస్వతీమాతగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి పల్లకీ సేవలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ హరితకృష్ణ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాళరాత్రి అలంకరణలో భ్రమరాంబిక



ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబికాదేవి బుధవారం కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉప ప్రధాన అర్చకుడు రవీందర్‌శర్మ, ఈవో నాగేశ్వర్‌రావు, అర్చకులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఐనవోలు

జగమేలుతోంది.. మన బతుకమ్మ

'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..
ఏమేమి కాయప్పునే గౌరమ్మ..
చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ..
ఒక్కోసి పువ్వేసి సందమామ.. బతుకమ్మ బతుకమ్మ
ఉయ్యాలో.. మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో..
అంటూ ఓరుగల్లువ్యాప్తంగా బతుకమ్మ పాటలు మారుమోగుతున్నాయి..

నేడు సద్దుల బతుకమ్మ

ఎన్నో ప్రత్యేకతలు.. సంప్రదాయాల మేళవింపు

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, న్యూస్‌టుడే, నర్సంపేట, దేవరుప్పుల(జనగామ)

ఇంద్రధనస్సులోని వర్ణాలు కలిగిన తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ నేడు జగమేలుతోంది.. తెలంగాణ సంస్కృతికి పూల పండగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.. మన సంప్రదాయాన్ని విదేశాల్లోనూ వ్యాప్తి చేస్తున్నారు.అక్కడ స్థిరపడ్డ మనవాళ్లు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ పండగను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..



16 ఏళ్లుగా ఒక్కో అడుగు పెంచుతూ..



నర్సంపేటకు చెందిన రుద్రారపు సరోజన-సైదయ్య దంపతులు తొమ్మిది రకాల పూలతో ఏటా ఒక అడుగు పెంచుతూ పెద్ద బతుకమ్మను పేరుస్తున్నారు. 16 ఏళ్ల కిందట తొలిసారి 3 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చారు. అప్పటి నుంచి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ వస్తున్నారు. ఈసారి 12 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజులుగా పలువురు కూలీలతో పెట్టి కొత్తగూడ, గంగారం, పాకాల అడవుల్లో గునుగు, తంగేడు, టేకు, అల్లీ పూలు, తామర, సీతజడ, బంతి, చామంతి వంటి 9 రకాల పూలను సేకరిస్తున్నారు. ఇంట్లో మహిళా కూలీలతో వాటిని కట్టలు కట్టిస్తున్నారు. ప్రత్యేకం ట్రాలీలో బతుకమ్మను మైదానానికి భాజాభజంత్రీల నడుమ తీసుకొస్తారు.

కర్ణాటక వాసులకు మక్కువ..



బతుకమ్మ పండగను కన్నడ ప్రజలు బాగా ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని హసన్ జిల్లా హళబిడ గ్రామానికి చెందిన అయ్యంగార్ యమున-రాజు దంపతులు పదేళ్ల కిందట నర్సంపేటకు వచ్చి బేకరీ నడుపుతున్నారు. ఇక్కడి ప్రజలు పూలను ఆరాధించే సంస్కృతి వారికి బాగా నచ్చింది. సొంతంగా బతుకమ్మ పేర్చి ఇక్కడి మహిళలతో కలిసి ఆడుతున్నారు.

సీతంపేటలో దీపావళికి వేడుకలు.. పురుషులూ ఆడుతారు..



భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్థులు దీపావళి పండగ సమయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. గ్రామస్థులు తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తున్నారు. దీపావళి రోజున పుట్టమన్ను తీసుకొచ్చి ఇళ్లలో జోడెడ్ల ప్రతిమలను తయారు చేసి పూజిస్తారు. మరుసటి రోజున కేధారేశ్వర వ్రతం చేస్తారు. జోడెడ్లను అలంకరించి ఊరేగిస్తారు. తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారు. మరుసటి రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. మహిళలతో పాటు, పురుషులు కూడా బతుకమ్మ ఆడుతారు.

విదేశాల్లోనూ సందడే..


టోక్యో నగరంలో..

ఒకప్పుడు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే సందడి చేసిన బతుకమ్మ పండగ నేడు విశ్వవ్యాప్తమైంది. యూకేలోని వారిక్ పట్టణంలో జరిగే వేడుకలు ఉత్తరాది దక్షిణాది సంస్కృతుల మేళవింపుగా సాగుతున్నాయని తెలుగు ఆడపడుచు, అక్కడి కౌన్సిలర్ ఎల్లాప్రగడ హేమ తెలిపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం విదేశీ మహిళలు ఆసక్తిగా గమనించి.. తమతో కలిసి వస్తున్నారని తెలుగు మహిళలు చెబుతున్నారు.

ముందస్తు అనుమతి తీసుకుంటాం..



- తాటిపాటి పల్లవీ-సాగర్, కోటోకు ఓజీమా వీధి, టోక్యో (దేవరుప్పల మండలం సీతారాంపురం)

మా వీధిలో 60 వరకు తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మ పండగను అందరం కలిసి జరుపుకొంటాం. సామూహికంగా నిర్వహించాలి కాబట్టి అధికారుల ముందస్తు అనుమతి తీసుకుంటాం. గడ్డిపూలు, వివిధ రాకల పూలతో బతుకమ్మ పేర్చి, ఒక దగ్గర గుమిగూడి ఆటపాటలతో సందడి చేసి, వాయినాలు ఇచ్చుకుంటాం. సమీపంలోని నదిలో నిమజ్జనం చేస్తాం.

వంటకాలను ఇచ్చిపుచ్చుకుంటాం..



- పెద్దాపురం మమత, అల్బనీ, అమెరికా, (దేవరుప్పుల)

అల్బనీ ప్రాంతంలో బతుకమ్మకు ప్రత్యేకంగా పూలు తెచ్చి మార్కెట్‌లో అమ్ముతుంటారు. ఇక్కడ తెలుగు సహా ఇతర రాష్ట్రాల మహిళలు కలిసి వేడుకలు జరుపుకొంటారు. సద్దుల బతుకమ్మ నాడు వండిన వంటకాలను ఒకరికొకరం పంచుకుంటాం.

ఇంట్లోనే నిమజ్జనం..



- గాదె ఉషశ్రీ, చెక్ రిపబ్లిక్, (దేవరుప్పుల)

మేము ఉండే దగ్గర 25-30 తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మను ఎవరి నివాసంలో వారే నిర్వహించి, అష్టమి రోజు ఒక నీటి తొట్టి ఏర్పాటు చేసుకొని నిమజ్జనం చేస్తాం. వీలును బట్టి అందరి ఇళ్లు కలియతిరిగి శుభాకాంక్షలు చెప్పుకొంటాం.

● కెనడా రాజధాని అటవా నగరంలో వరంగల్ జిల్లాకు చెందిన పలు అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి మండలం దండేపల్లికి చెందిన సుధీర్ కోదాటి ఈ ప్రాంతంలోని తెలుగువారిని సంఘటితం చేసి గత 15 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. తెలుగు అసోసియేషన్ నిర్వహించే బతుకమ్మ వేడుకలకు బంగారు నాణేలు, 500 డాలర్లు బహుమతులుగా ఇస్తున్నారు. 19 ఏళ్ల కింద అమెరికాలోని షికాగోలో స్థిరపడిన వర్ధన్నపేటకు చెందిన పూర్ణచందర్ అల్లమనేని 2003 నుంచి ఘనంగా సంబరాలు జరుపుతున్నారు.

కృషి చేశారు.. కొలువు సాధించారు

ఉద్యోగ సాధనలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నారు. కష్టనష్టాలను దాటారు. కల సాకారమైన వేళ తమ కష్టాన్ని మరిచిపోయారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పలువురు అభ్యర్థులు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. పండగ వేళ నియామక పత్రాలు అందుకుని వారి కుటుంబంలో వెలుగులు నింపారు.

ఉపాధ్యాయులుగా భార్యాభర్తలు



భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: భీమదేవరపల్లి మండలానికి చెందిన కోన రాజు, సమత దంపతులు రెండో ప్రయత్నంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కొలువు సాధించారు. మాణిక్యాపూర్‌కు చెందిన కోన రాజుతో కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం పెర్కపల్లికి చెందిన మేడిశెట్టి సమతకు 2012లో వివాహం జరిగింది. రాజు ఎంకాం, బీఈడీ పూర్తి చేసి ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేశారు. సమత పెళ్లి అయ్యాక ఫాతిమా కళాశాలలో బీఈడీ పూర్తి చేశారు. 2018లో ఇద్దరు డీఎస్సీ రాసినప్పటికీ ఉద్యోగం రాలేదు. మరింత పట్టుదలతో చదివి 2024 డీఎస్సీ రాశారు. సమత కరీంనగర్ జిల్లాలో ఎస్జీటీలో 41వ ర్యాంకు, రాజు హన్మకొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో జిల్లా 2వ ర్యాంకు సాధించి కొలువు దక్కించుకున్నారు.

కుట్టుమిషన్ నడుపుతూ..



కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన అంద్రాస మంజుల, తెలుగు భాషా పండితులు (లాంగ్వేజ్ పండిట్)గా వరంగల్ జిల్లాలో ఐదో ర్యాంకు సాధించి బుధవారం ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పత్రం అందుకుంది. సాధారణ గృహిణిగా కుట్టుమిషన్ నడుపుతూ తెలుగులో ఎంఏ పూర్తి చేశారు. తర్వాత టీపీటీ ఉత్తీర్ణులయ్యారు. అనంతరం టీచర్ ఉద్యోగ అన్వేషణలో భాగంగా రెండు సార్లు పోటీ పడి మూడో సారి భాషా పండితులుగా ఎంపికయ్యారు. రాష్ట్ర, జాతీయ అర్హత పరీక్షలోనూ ఉత్తీర్ణులయ్యారు. ఈమె భర్త అంద్రాస రవి రెండున్నర నెలల క్రితం టీజీపీఎస్సీ విడుదల చేసిన గురుకుల ప్రిన్సిపల్ పరీక్షలో ప్రతిభ చాటారు. ప్రస్తుతం భూపాలపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల్లో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఒకే ఊరిలో నలుగురికి ఉద్యోగాలు...

కమలాపూర్, న్యూస్‌టుడే: ఉప్పల్ గ్రామంలో డీఎస్సీ 2024 ఫలితాల్లో నలుగురికి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు దక్కాయి. ఒక్కో అభ్యర్థిది ఒక్కో నేపథ్యం. ముగ్గురు రెండో ప్రయత్నంలో, మరొకరు మూడో ప్రయత్నంలో ఉద్యోగం పొందారు.

డెయిరీలో పనిచేస్తూ..



సిరికొండ మోహన్‌కుమార్, బీఎస్సీ, బీఈడీ, డీఈడీ, బీఎల్ఐఎస్సీ పూర్తి చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఏడాదికాలంగా కష్టపడి చదివారు. ఇంటి దగ్గర ఖర్చుల కోసం వేకువజామున, రాత్రి డెయిరీలో పనిచేశారు. అనంతరం హనుమకొండలో గది అద్దెకు తీసుకుని డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. జిల్లాలో 43 ర్యాంకు సాధించి ఎస్జీటీ ఉద్యోగం సాధించారు.

ఇంటి దగ్గరే సన్నద్ధం..

అన్నం సరేశ్మ ఎస్జీటీలో జిల్లాలో ఆరో ర్యాంకు సాధించారు. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు. ఇంటిదగ్గర ఉంటూనే స్వతహాగా నోట్సు తయారు చేసుకుని ఉద్యోగం సాధించాలనే తపనతో డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ర్యాంకు సాధించి టీచర్‌గా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ నియామక పత్రం అందుకోవడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేసింది.

కూలి పనులకు వెళ్తూ..

మంత్రి హరీశ్ డీఈడీ పూర్తి చేసి, దూరవిద్యలో డిగ్రీ చదివారు. పుస్తకాలు, నోట్సు, మెటీరియల్ కోసం కూలీ పనులకు వెళ్లానని తన మనసులోని మాటను వెల్లడించారు. భార్య గర్భిణిగా ఉండటంతో కుటుంబ సమస్యలతో సతమతమయ్యానని తెలిపారు. పట్టుదలతో చదివి ఎస్జీటీగా ఉద్యోగం సాధించారు. నియామక పత్రం అందుకొని ఆనందం వ్యక్తం చేశారు.

పరీక్షించి.. నాణ్యత వివరించి..!

● 'ఈనాడు' కథనంతో కదిలిన ఇంజినీర్లు


దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో నీళ్లను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ, ఏఈ

కార్పొరేషన్, న్యూస్‌టుడే

నల్లా నీళ్లను తాగేందుకు నగర ప్రజలు సాహసించడం లేదు. రంగుమారిన తాగునీటి సరఫరాతో బల్దియాకు ఫిర్యాదులు పెరిగాయి. మురుగు మరక తొలగించడం, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నామని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రేటర్ వరంగల్ ఇంజినీర్లు క్షేత్రస్థాయికి కదిలారు. ఈ నెల 8న ఈనాడులో 'పండగ పూట.. తాగునీటి గోస' శీర్షికన ప్రచురితమైన కథనంతో రెండు రోజులుగా వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పది ప్రత్యేక బృందాలు ఇంటింటా తాగునీటి పరీక్షలు చేస్తున్నారు. హనుమకొండ ప్రాంతం నయీంనగర్, కొత్తూరుజెండా, కుమార్‌పల్లి, బాలసముద్రం, కాజీపేట బాపూజీనగర్, సిద్ధార్థనగర్, వరంగల్ ప్రాంతంలో రంగంపేట, సరస్వతీనగర్, కొత్తవాడ, ఎల్బీనగర్, ఓ సిటీ, చింతల్, రామన్నపేట కాలనీల్లో ఇంటింటికెళ్లి కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు పరిశీలించారు. క్లోరినేషన్ ఎంత శాతం ఉందో పరీక్షలు చేశారు. కుళాయి నీళ్లను తాగాలని ప్రజలకు సూచించారు.

రోజూ సరఫరా చేయాలి

పండగలు ఉన్నందున తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఇంజినీర్లను మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. హనుమకొండ కేయూసీ, వరంగల్ దేశాయిపేట, అండర్ రైల్వేగేటు జోన్ల పరిధిలో నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. రోజూ తాగునీటి సరఫరా జరగాలని సూచించారు. ఈనాడులో ప్రచురితమైన కథనాన్ని కొందరు సామాజిక కార్యకర్తలు తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ.గౌతమ్‌కు పంపించారు.

హైదరాబాద్‌కు వెళ్లిన డీఎస్సీ విజేతలు


జెండా ఊపి బస్సును సాగనంపుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ 2024లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించేందుకు బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందిస్తారు. బుధవారం జిల్లాలో ఎంపికైన 169 మంది అభ్యర్థులు తమ నియామక పత్రాలను అందుకోవడానికి హైదరాబాద్ బయలుదేరారు. కలెక్టరేట్ వద్ద అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి జెండా ఊపి వారిన బస్సును సాగనంపారు. డీఈవో వాసంతి, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి


కలెక్టరేట్ ముందు బైఠాయించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సుబేదారి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసిన తర్వాతే ప్రభుత్వం ఉద్యోగ నియమకాలు చేపట్టాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బి.భిక్షపతి అన్నారు. వర్గీకరణ చేయకుండా నియామకాలను నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా చేరుకున్నారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తోపులాట చోటుచేసుకొంది. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంద కుమార్, భిక్షపతి మాట్లాడారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు వెల్పుల సూరన్న, పట్టు రవి, బండారి సురేందర్, దినేష్, గద్దల సుకుమార్, మంద రాజు, కుమ్మరి రాజయ్య, శాంతసాగర్, తిరుపతి, సంపత్, ఉమా, శివ, స్వరాజ్, రజితి, లక్ష్మి పాల్గొన్నారు.

వ్యాపార అనుమతి లేకుంటే జరిమానా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు ఉండాలని, లేకపోతే జరిమానా విధించాలని ప్రజారోగ్య విభాగం అధికారులు, ఉద్యోగులను గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ ఆదేశించారు. బుధవారం హంటర్‌రోడ్ ప్రాంతంలోని పెట్రోల్ పంపు, వాహనాల షోరూం, ఇతర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వారందరికీ జరిమానా విధించాలని కమిషనర్ సూచించారు. ట్రేడ్ లైసెన్సు రుసుముల వసూళ్లను ముమ్మరం చేయాలన్నారు. హంటర్‌రోడ్ దుర్గాదేవి కాలనీ, ప్రశాంత్‌నగర్-3, లోటస్ కాలనీ, యాదవనగర్, వంగపహాడ్, వరంగల్ ప్రాంతంలోని స్తంభంపల్లి, గాడిపెల్లి, నక్కలపెల్లి, శంభునిపేట, రంగశాయిపేటలో సీసీ రహదారులు, మురుగు కాలువలు పరిశీలించారు. ఎస్ఈ రాజయ్య, ఈఈ సంతోష్‌బాబు, డీఈలు, శ్రీకాంత్, రవికిరణ్, సీఎంహెచ్‌వో డా.రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్లు నరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల బతుకమ్మ వేడుక



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో బుధవారం పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు బతకమ్మ వేడుకలను నిర్వహించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా దంపతులతో పాటు పలువురు పాల్గొని ఆడారు. బతుకమ్మను అందంగా తీర్చిదిద్దిన వారికి సీపీ బహుమతి అందించారు.

> ప్రస్తుతం మడికొండలోని మెట్టుగుట్ట సీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన 240 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయి. ఇందులో 160 ఎకరాలు రైల్వేకు ఇచ్చారు. మిగిలిన స్థలం కూడా కోచ్‌ల నిర్మాణానికి కేంద్రం సేకరించే అవకాశాలున్నాయి.

వందేభారత్ తయారీ ఇక్కడే!

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనతో ఆనందం
- అదనంగా రూ.66 కోట్లు మంజూరు

కాజీపేట, న్యూస్‌టుడే

ఓరుగల్లు ప్రజల చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది. గత 45 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో కాజీపేటలో కోచ్‌లు తయారు చేస్తామని ప్రకటించడం ఆశలు రేపాయి. రైల్వే జంక్షన్ కాజీపేటలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న వ్యాగన్ తయారీ కేంద్రాన్నే అప్‌గ్రేడ్ చేసి కోచ్‌లు తయారు చేయాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్న వందే భారత్ రైలు కోచ్‌లు ఇక్కడ తయారు చేయాలని నిర్ణయించడం కాజీపేటకు గొప్ప మలుపు కాబోతోంది.





నిర్మాణంలో భారీ షెడ్



సిద్ధంగా క్రేన్లు

ఒక్కో అడుగు పడుతూ..

వరంగల్ ప్రజల నాలుగు దశాబ్దాల ఉద్యమ ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ. 1980 దశకంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం సైతం మంజూరు చేసింది. డీజిల్ షెడ్ పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. పంజాబ్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ పరిశ్రమలు నెలకొల్పి యువతను ఆకట్టుకోవాలనే ఆలోచనతో కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని కపుర్తాలకు మార్చారు. అప్పటి నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. 2010లో వ్యాగన్ మరమ్మతుల వర్క్‌షాపు, వ్యాగన్ తయారీ కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అక్కడ స్థలం లేకపోవడంతో కాజీపేటకు తరలించారు. ఇక్కడా స్థల సేకరణలో ఆలస్యమైంది. చివరికి 2016లో వ్యాగన్ షెడ్ కోసం నిధులు కేటాయించారు. ఎట్టకేలకు 2023లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు పనులను ప్రారంభించారు. స్థానికులు దీనిపై అసంతృప్తిగా ఉండటంతో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపుతో పాటు పిరియాడికల్ ఓవరాహాలింగ్ కేంద్రాన్ని సైతం మంజూరు చేశారు. కోచ్ మీద ఉన్న ఆశ అలాగే ఉంది. స్థానిక రైల్వే ఐకాస ఆధ్వర్యంలో కోచ్ సాధన సమితి పేరు మీద ఆందోళన చేశారు. చివరకు దేశవ్యాప్తంగా వందేభారత్ రైలు కోచ్‌లకు డిమాండ్ ఉండటంతో వ్యాగన్ తయారీ పరిశ్రమను, పీఓహెచ్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అభివృద్ధి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

అడ్డంకులు లేకుండా ఉన్న స్థలంలోనే..

కోచ్ ఫ్యాక్టరీకి మరింత స్థలం అవసరం. సేకరణకు సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి 160 ఎకరాలను సేకరించి వ్యాగన్ పరిశ్రమను నెలకొల్పుతున్నారు. రెండు ప్రధాన షెడ్ల నిర్మాణం, కార్యాలయాల భవనాలు నిర్మిస్తున్నారు.. దీనికి అదనంగా మరో షెడ్‌ను నిర్మించడానికి రూ.66 కోట్లను కేంద్రం విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 160 ఎకరాల్లోనే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకోవాలని చూస్తున్నారు.. రాబోయే రోజుల్లో అదనపు స్థలం సేకరించి మరింత విస్తరిస్తారు.

చెన్నై ఇంటగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో

చెన్నై పెరంబూరులో గల ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో ఇక్కడ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ వందే భారత్ కోచ్‌లు తయారవుతున్నాయి. దీనికి అదనంగా ఇప్పుడు కాజీపేటలో ప్రారంభం అవుతాయి.

3000 మంది సిబ్బంది..

కోచ్ ఫ్యాక్టరీకి 3000 మంది సిబ్బంది అదనంగా రానున్నారు. పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమలకు 2000 మంది అవసరం అవుతారు. రెండు పరిశ్రమలకు కలిపి మొత్తం 5000 మంది కార్మికులు వచ్చే అవకాశం ఉంది. ముందుగా వందేభారత్ రైళ్ల కోచ్‌ల తయారీపైనే దృష్టి పెడుతున్నారు. షెడ్ నిర్మాణం కాగానే తయారీ యంత్రాలను అమరుస్తారు. పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసే నిపుణులను రప్పించి ఇక్కడి కార్మికులు, అధికారులకు శిక్షణ ఇస్తారు. కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో పనిచేస్తే రాంపూర్, కాజీపేట ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అనుబంధ పరిశ్రమలు వస్తాయి.



రైల్వే వ్యాగన్ల తయారీ కేంద్రం షెడ్



వ్యాగన్ పరిశ్రమ కార్యాలయం

అంకెల్లో వివరాలు..

- కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ గతిశక్తి పథకం కింద ఏర్పాటు చేస్తోంది.
- వ్యాగన్ షెడ్ కాజీపేటలో ప్రతిపాదించిన సంవత్సరం- 2013
- కేటాయించిన నిధులు రూ.521 కోట్లు
- మొదటి దశలో విడుదలైనవి రూ.220 కోట్లు
- వ్యాగన్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది: 2023
- పీఓహెచ్‌గా అప్‌గ్రేడ్ అయింది: 2023
- కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యేది: 2025-26

పడిలేచిన కెరటం..



ఒకప్పుడు ఇంటి ముందు పోస్ట్.. అన్నమాట వినపడగానే ఇంట్లో అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసేది. దూరాన ఉన్న బంధువుల యోగక్షేమాలను అది మోసుకొచ్చేది. మన క్షేమ సమాచారం తీసుకెళ్లేది. ఇంటింటిని పలకరించే ఆత్మీయ బంధువులా తపాలాశాఖ ఉండేది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం పెరిగి అంతర్జాలం, చరవాణులు అందుబాటులోకి వచ్చాక ఉత్తర ప్రత్యుత్తరాలు కనుమరుగయ్యాయి. మనియార్డర్లు పంపేవారు లేరు. తపాలాశాఖ ప్రాభవం కోల్పోయే పరిస్థితి నుంచి మళ్లీ కోలుకుంది. వినూత్న సేవలతో ప్రజాదరణ పొందుతోంది. గురువారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, శివనగర్

తపాలా సేవలు ఆదర్శం

గ్రామస్థాయిలో పటిష్ఠ సమాచార, మానవ వనరులతో కూడిన వ్యవస్థ ఒక్క తపాలాశాఖకే సొంతం. వర్షం కురిసినా.. వరదలు పొంగినా తోకలేని పిట్ట తొంభై మైళ్లు వెళ్తుంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థ తోడుతో తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. సేవలను అందించడంలో వేగం పెరిగింది. సాధారణ సేవలతో పాటు పొదుపు, బీమా, బ్యాంకింగ్ రంగంలోనూ అడుగిడింది.

అందిస్తున్న సేవలు..

సాధారణ తపాలా సేవలతో పాటు స్పీడ్‌పోస్టు, క్యాష్ ఆన్ డెలివరి (సీవోడీ), ఎలక్ట్రానిక్ మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ అప్‌డేట్ (సవరణ), తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు, మైస్టాంప్, వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్. ● పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, కిసాన్ వికాస పత్రాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్, నెలవారీ ఆదాయ పథకం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, 1 నుంచి 5 ఏళ్ల టైమ్ డిపాజిట్ ఖాతాలు, తపాలా బ్యాంకు, ఏటీఎం.



మీసేవ తరహాలో..

విమాన, బస్సు, రైలు టికెట్ల రిజర్వేషన్, అన్ని రకాల బీమా పథకాలు, ఇంటి, నల్లా పన్నులు, గ్యాస్ బిల్లులు, ఈఎంఐ చెల్లింపులు, ఫాస్టాట్యాగ్, ఐటీ రిటర్న్స్, సెల్‌ఫోన్ సిమ్‌కార్డు రిఛార్జి, పాన్‌కార్డు, పాస్‌పోర్టుకు దరఖాస్తులు, పీఎం ఫసల్ బీమా, పీఎం జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి శ్రమయోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం), ప్రధాన మంత్రి లఘు వ్యాపారి మన్-ధన్ యోజన (పీఎం-ఎల్‌వీఎం), ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి), నేషనల్ పెన్షన్ సిస్టం, జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) జారీకి దరఖాస్తు, ఇ-డిస్ట్రిక్ట్ సేవలు.



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలందుకుంటున్న వినియోగదారులు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇలా.. వరంగల్, హనుమకొండ డివిజన్ల పరిధిలో ఐదు ప్రధాన, 90 సబ్ యూనిట్, గ్రామస్థాయిలో 679 తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

లేఖల్లోనే మాట్లాడుకునేవాళ్లం..



- రామ్మూర్తి, విశ్రాంత జైలర్, శివనగర్ (వరంగల్)

నేను 1985 నుంచి తొమ్మిదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా (ప్రస్తుతం వైఎస్ఆర్ జిల్లా) ప్రొద్దుటూరు సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేశాను. నా భార్య సత్యవతి వరంగల్‌లో ఉండేది. ఆమెకు నాలుగు రోజులకు ఒక లేఖ రాసేవాడిని. ఆమె యోగక్షేమాలు, పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ఆరోగ్యం ఎలా ఉందంటూ.. ఉత్తరాల ద్వారా అడిగేవాన్ని. ఆమె రాసిన ఉత్తరం చదువుతుంటే ఆమె మాట్లాడుతున్నట్లే అనుభూతి పొందేవాడిని. టెలికాం రంగం ఎంత అభివృద్ధి చెందినా భావవ్యక్తీకరణ, మనసును కదిలించడం ఉత్తరానికే దక్కుతుంది..

పథకాలపై విస్తృత ప్రచారం



తపాలా పథకాలు, సేవలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధాన గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) సేవలను ఎక్కువగా ఉపయోగించుకునేలా డిజిటల్ సేవలను విస్తృతం చేశాం.

- రవికుమార్, సూపరింటెండెంట్, వరంగల్

చదువుల తల్లిగా భద్రకాళి!



రంగంపేట(వరంగల్), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం వరంగల్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారు సరస్వతీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. లలిత పంచమి పర్వదినం కావడంతో అమ్మ సన్నిధిలో పిల్లలతో అక్షరాలు దిద్దించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి రథసేవ నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. చదువుల తల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

● 'మహాష్టమి(దుర్గాష్టమి) రోజున కోటి యోగిని గణములతో శ్రీభద్రకాళి అమ్మవారి జన్మించారు. అందుకే మహాష్టమి పర్వదినాన సద్దుల బతుకమ్మ ఆడతారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని' ఈవో శేషుభారతి తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై సద్దుమణగని ఆందోళన



రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారును అడ్డుకుంటున్న విద్యార్థులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం విద్యార్థులు చేస్తున్న ఆందోళన సద్దుమణగడం లేదు. బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు పీహెచ్‌డీ- 2022 కేటగిరి-2 రెండో జాబితాలో ప్రవేశాలు కల్పించాలని రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారుకు అడ్డంగా బైఠాయించారు. తమకు ప్రవేశాలు కల్పించే వరకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించడంతో కేయూ రాణా ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి వారిని నిలువరించారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఉప కులపతి వాకాటి కరుణకు వివరించి, న్యాయం జరిగేలా చూస్తానని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మంద నరేష్, రాకేష్, మనోహర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

దేశాలు దాటి వెళ్లి.. మృతదేహమై తిరిగొచ్చి!



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉగాండాలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న జనగామకు చెందిన ఇటికాల తిరుమలేశ్ తాను పని చేసే కంపెనీలోనే సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉగాండా నుంచి ఐదు రోజులకు బుధవారం తిరుమలేశ్ మృతదేహం జనగామ పట్టణం గిర్నిగడ్డలోని స్వగృహానికి మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. తిరుమలేశ్ మృతదేహంతో పాటు ఆయన భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండా నుంచి వచ్చారు. జనగామలో ఉన్న మృతుడి తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నా, చెల్లెలు హేమలతతో పాటు కుమార్తె అఖిల ఐదు రోజులుగా మృతదేహం కోసం నిరీక్షిస్తూ కన్నీటి పర్యంతంలో మునిగిపోయారు. 'దేశం కాని దేశం వెళ్లి... శవంగా వచ్చావా.. బిడ్డా.. నీ భార్య పిల్లలను ఆగం చేసితివా బిడ్డా..' అంటూ తల్లి కిష్టమ్మ విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమలేశ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువుకు అవసరమైతే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చి, ఆర్థిక సాయం అందజేశారు. అంత్యక్రియలు పట్టణంలోని మార్కెట్ సమీప శ్మశాన వాటికలో సాయంత్రం 6గంటలకు ముగిసాయి.

నిరుపేద కుటుంబంపై దీర్ఘకాలిక జబ్బు పంజా

- గంటల వ్యవధిలో తల్లీకుమారుడు మృతి



తల్లి చిదురాల శోభతో సాయికిరణ్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం. భార్య, భర్త, ఇద్దరు కుమారులు రోజూ పనిచేసుకొని జీవించేవారు. దీర్ఘకాలిక జబ్బు బారినపడిన తల్లి, కుమారుడు ఒకేరోజు గంటల వ్యవధిలో మృతి చెందారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామానికి చెందిన చిదురాల లక్ష్మణ్ తాపీమేస్త్రీగా, భార్య శోభ (53) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శోభకు రెండేళ్ల కిందట బోన్ టీబీ సోకగా.. గ్రామంలోనే మోటార్ మెకానిక్ పని చేస్తున్న చిన్న కుమారుడు సాయికిరణ్ (25) ఏడాది కిందట నోటి క్యాన్సర్‌కు గురయ్యాడు. ఉన్నంతలో ఆసుపత్రులకు తిరిగి ఖర్చు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. మంచానికే పరిమితమైన తల్లి బుధవారం ఉదయం మృతి చెందగా.. రెండు గంటల వ్యవధిలో కుమారుడు సైతం కన్నుమూశాడు. బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఒకే ఇంట్లో ఇద్దరి మృతి ఆ కుటుంబం, గ్రామంలో విషాదం నింపింది. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులే విరాళాలు వేసుకొని ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

'మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి'


ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మార్కెట్ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు అన్నారు. బుధవారం గుడెప్పాడ్‌లోని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారంలో వారు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్‌గా బీరం సునంద, వైస్ ఛైర్మన్‌గా తాంగెళ్లపల్లి తిరుపతి, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, జిల్లా మార్కెట్ అధికారి అనురాధ, ఆత్మకూరు కార్యదర్శి సురేఖ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పండగ వేళ.. కొత్త టీచర్ల ఆనందం


నియామక పత్రాలతో ఉపాధ్యాయులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో జిల్లా నుంచి 169 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఎంతోకాలంగా ఎదురుచూసిన తమ కల ఉత్తర్వులు అందుకోవడంతో వారి కళ్లలో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి.

తహసీల్దార్‌పై దాడి యత్నం సరికాదు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వరంగల్ ఎస్‌ఆర్ నగర్‌లో సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు స్థల పరిశీలనకు వెళ్లిన వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌పై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎన్జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు సోమయ్య, పుల్లూరు వేణుగోపాల్, శ్యాం సుందర్, రమేష్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల అరెస్టు

మడికొండ, న్యూస్‌టుడే: బొడగుట్ట శ్మశానవాటిక వద్ద ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపారు. ఎస్సై జె.రాజబాబు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా.. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వీరిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. కడిపికొండ వద్ద ఓ డెయిరీలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన జితేందర్‌రాయ్, రాహుల్‌కుమార్ యాదవ్ బుధవారం కాజీపేట రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఇతరుల వద్ద గంజాయి కొనుగోలు చేసి వస్తూ పట్టుబడ్డారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

ఐనవోలు, న్యూస్‌టుడే: అనారోగ్య కారణంగా ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. జఫర్‌గడ్ ఎస్సై రాంచరణ్ కథనం ప్రకారం. . వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మరపెల్లి కిషన్‌రావు (58) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. గతేడాది కుమారుడు, ఇప్పుడు భర్త ఆత్మహత్య చేసుకోవడంతో భార్య లీలాబాయి కన్నీరుమున్నీరుగా విలపించారు.

భర్తపై దాడి కేసులో అయిదేళ్ల జైలు

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: భర్తను బంధించి దాడి చేసిన భార్యతో పాటు ఆమె తల్లి, అన్నకు అయిదేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జాబిశెట్టి ఉపేందర్‌రావు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పరకాల మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన పంచగిరి భాస్కర్ రాజీపేటకు చెందిన నాగజ్యోతిని వివాహం చేసుకొని అత్తగారి ఇంట్లోనే ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న భాస్కర్ 2020 జనవరి 14న సంక్రాంతి పండగ రోజు తన జీతం డబ్బులు రూ.10 వేలు తీసుకొని ఇంటికి వచ్చాడు. అదే రోజు ఆస్తుల విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో అతని భార్య, అత్త ప్రమీల, బావమరిది భిక్షపతి కలిసి భాస్కర్ నోట్లో గుడ్డలు కుక్కి దాడి చేశారు. కాగుతున్న వేడి నూనెను నాగజ్యోతి తన భర్త తలపై పోసింది. ఈ విషయంపై భాస్కర్ అన్న శ్రీనివాస్ పరకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భాస్కర్ భార్య, అత్త, బావమరుదులపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి నిందితులకు పైవిధంగా శిక్షించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున జరిమానా విధించారు. ఈ కేసు ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వనజ వాదించగా.. కోర్టు కానిస్టేబుల్ ఎం.సుధాకర్ పలువురు సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చారు.

ఇంట్లో చోరీ

శాయంపేట, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శాయంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక మాజీ సర్పంచి వల్పదాసి చంద్రమౌళి 15 రోజుల క్రితం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేరారు. బుధవారం వారి బంధువు ఇల్లు శుభ్రం చేయడానికి రావడంతో ఇంటి బెడం తొలగించి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్ కుమార్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. ఎంత మొత్తం దొంగతనం జరిగిందో తెలియాల్సి ఉంది.

ఇద్దరిపై దాడి.. కేసు నమోదు

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: హోటల్‌లో ఓ వ్యక్తి అకారణంగా దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. హనుమకొండకు చెందిన శ్రీకాంత్‌గౌడ్, అతడి మిత్రుడు సందీప్‌రెడ్డి ఈ నెల 6న బావుపేట క్రాస్‌రోడ్డులోని ఓ హోటల్‌లో భోజనం చేస్తున్నారు. వీరి పక్క టేబుల్‌పై మద్యం మత్తులో పడుకొన్న వ్యక్తిని ఇతరులు లేపగా.. అతను వీరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసభ్య పదజాలంతో దూషించాడు. తమనేందుకు తిడుతున్నావని అడిగినందుకు తన మిత్రులను పిలిపించుకుని కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన శ్రీకాంత్‌గౌడ్, సందీప్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

సద్దుల బతుకమ్మకు విస్తృత ఏర్పాట్లు

హనుమకొండ కలెక్టరేట్, భీమదేవరపల్లి, పరకాల, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పద్మాక్షి గుండం పరిసరాల్లో, అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. భీమదేవరపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ ములుకనూర్‌లో అంబేడ్కర్ కూడలి నుంచి బతుకమ్మ బండ వరకు ఇరువైపులా విద్యుత్తు దీపాలు ఏర్పాట్లు చేశారు. పరకాల పట్టణంలోని పశువుల సంత ఆవరణలో, దామెర చెరువువద్ద సీతారాంపురం, రాజీపేటలో లైటింగ్, బారికేడ్లను పెట్టించారు.


ములుకనూర్‌లో బతుకమ్మ బండ వద్ద విద్యుత్తు కాంతులు


శుభ్రం చేసిన పద్మాక్షి గుండం, దీపాల వెలుగులో అమ్మవారి ఆలయం

ఆత్మార్పణ శిలలు లభ్యం..


ఏనుగుతో కనిపిస్తున్న శిల్పం

న్యూశాయంపేట: హనుమకొండ సిద్దేశ్వరాలయ ప్రాంగణంలో రెండు ఆత్మార్పణ శిలలు గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర పరిశోధక బృందం సభ్యులు కొలిపాక శ్రీనివాస్, రామోజు హరగోపాల్ తెలిపారు. సిద్దేశ్వరాలయంలో ఉన్న విడిశిల్పాల్లో నంది ముందు రెండు వీరగల్లున్నాయి. ఇవి రెండు ఏనుగులతో కనిపించే విశేష శిల్పాలు, వీటిలో వీరులు తమ కంఠాలను కత్తులతో ఉత్తరించుకుంటున్నారు. వారికి రాజలాంఛనాలైన ఛత్రాలు పట్టి ఉండడం రాజకుటుంబీకులై ఉంటారని తెలుస్తోంది. ఇటువంటి వీరగల్లులు ముందెన్నడు తెలంగాణలో కనిపించలేదని వారన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ఉచిత చేప పిల్లలను వదిలారు. అనంతరం అక్కడే జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని రెండు సంవత్సరాల్లో పూర్తి చేసి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గంలోని ప్రతీ ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. మత్స్య శాఖ జిల్లా అధికారి నాగమణి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సుధాకర్, జిల్లా డైరెక్టర్ పిట్టల సత్యనారాయణ, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చదువుతో గుర్తింపు



హోంగార్డు కుమార్తెను అభినందిస్తున్న సీపీ

వరంగల్‌క్రైం: సమాజంలో చదువుతోనే గుర్తింపు ఉంటుందని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కమిషనరేట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న కుమారస్వామి కుమార్తె మెడికల్ సీటు సాధించడంతో బుధవారం ఆమెను సీపీ అభినందించారు. పోలీసుశాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా పిల్లల చదువుపై దృష్టి పెట్టాలన్నారు.

హైడ్రాతో డ్రామాలు

సుబేదారి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భారాస చేసిన తప్పులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతోందని భాజపా క్రమశిక్షణ సంఘం రాష్ట్ర ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. బుధవారం హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కుల రాజకీయాలు చేస్తూ విద్వేషాలు రెచ్చగొట్టడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. పేదలకు రక్షణగా భాజపా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు గొలి మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, సునీత, శ్రీరాములు, పాపారావు, ప్రభాకర్, రాంచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి



శాయంపేట, న్యూస్‌టుడే: మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ చల్లా రాజిరెడ్డి పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కాజీపేట రూరల్, న్యూస్‌టుడే: కాజీపేట మండలంలోని తరాలపల్లికి చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు హరీష్‌రెడ్డి, యాదవరెడ్డి, బషీర్, డేవిడ్, మోరీస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమారం : పైడిపల్లిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ జన్ను షీభారాణి, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

పరకాల, న్యూస్‌టుడే: పరకాల వ్యవసాయ మార్కెట్‌కు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి జీవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం దుర్గాష్టమి పండగ, శుక్రవారం కార్మికులు, వ్యాపారుల కోరిక మేరకు సెలవులు ఇచ్చామని, శనివారం దసరా, ఆదివారం పిల్ల దసరా సందర్భంగా మార్కెట్ తీసి ఉండదన్నారు. తిరిగి సోమవారం నుంచి మార్కెట్ తెరుస్తామని, రైతులు గమనించాలని కోరారు.

సామాజిక ఔన్నత్యాన్ని నిలబెట్టాలి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : పర్వదినాలప్పుడే కాకుండా దేశ సంస్కృతి, సంప్రదాయాలను, కళలను కాపాడుకోవడానికి మహిళలు ముందుకు రావాలని, కుటుంబ విలువలతో పాటు సామాజిక ఔన్నత్యాన్ని నిలబెట్టాలని భాజపా జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ అన్నారు. బుధవారం హనుమకొండ ఉజిలీబేస్‌లోని శ్రీహనుమాన్ సహిత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీభారతీ సాహితీ సంస్కృతి వ్యవస్థాపక అధ్యక్షుడు చొల్లేటి కృష్ణమాచారి అధ్యక్షతన తెలంగాణ బతుకమ్మ గేయ పోటీలు నిర్వహించారు. విజేతలైన మహిళలకు రావుపద్మ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. సంస్థ సభ్యులు ఏడెల్లి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసిన రసాయనాలతో ఐస్‌క్రీం తయారీ

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: గడువు ముగిసిన రసాయనాలతో ఐస్‌క్రీం తయారు చేస్తున్న కేంద్రంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. వరంగల్ ఏనుమాముల సమీపంలో శ్రీపాల్‌రెడ్డి గత కొద్ది రోజులుగా నాణ్యత లేని ఐస్‌క్రీంలు తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. గడువు ముగిసిన 30 రకాల రసాయనాలను, తయారుచేసిన ఐస్‌క్రీంను స్వాధీనం చేసుకున్నారు. వాటి రూ.10.5 లక్షల వరకు ఉంటుందని ఏసీపీ తెలిపారు. వాటిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్, ఎస్సై శరత్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో పారిశుద్ధ్య కార్మికులు, ఆశ కార్యకర్తలకు భారాస నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం చీరలను పంపిణీ చేశారు. 1వ డివిజన్‌లో విశిష్ట సేవలందిస్తున్న వారికి సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని అందించినట్లు చెప్పారు.

బహుజన రాజ్యాధికార పితామహుడు కాన్షీరాం

విద్యానగర్, న్యూస్‌టుడే: బహుజన రాజ్యాధికార పితామహుడు కాన్షీరాం అని బహుజన విద్యార్థి సమాఖ్య (బీఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు, కేయూ ఇన్‌ఛార్జి బోట్ల మనోహర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం ముందు కాన్షీరాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహేందర్, భరత్, సందీప్, వినోద్, నాగరాణి, సోనియా, ప్రదీప్ పాల్గొన్నారు.